# అన్న

పొద్దు గూట్లో పడటానికింకో గంట సమయముంది. వాకిల్లలో కూచొని చలికాలపు నీరెండ కాగుతున్నారు ముసలివాళ్లు... సాయంత్రం వంట చేయడానికి స్త్రీలు బొగ్గు పొయ్యిలంటేస్తున్నారు. చలనం లేని గాలి. కార్మికవాడల్నిండా పొగ దట్టంగా అలుముకుంటుంది. దానికి తోడు వాహనాలు వదులుతున్న పొగ... అప్పుడప్పుడు నడిచే ఎరువుల ఫ్యాక్టరీ లోంచి బుర్‌బుర్‌మని ధ్వనొస్తుంది. సమ్మె వున్నన్ని రోజులు విశ్రాంతి తీసుకున్న సి. యస్. పిలు బొగ్గును లోడు చేస్తున్నాయి.

రాజమల్లు వాకిట్లోని పరారీ గోడదగ్గరున్న బొగ్గు పొయ్యిలోంచి గుప్‌గుప్‌మని పొగ వస్తుంది. రాజమల్లు భార్య లక్ష్మి తేపకోసారి బయటకొస్తూ పొయ్యింకా అంటుకోవడం లేదని విసుక్కుంటూ లోపలికెళ్తుంది... మొదటి బజిలీ చేసొచ్చిన రాజమల్లు స్నానం చేసి భోజనం ముగించాడు... చిన్నగా కునుకు కూడా తీసాడు... ఇంట్లోంచి లేసొచ్చి వాకిట్లో వాల్చున్న మంచంలో వెల్లకిలా పడుకున్నాడు... ఇరవై ఏళ్ల క్రితం బొగ్గు గనుల్లో బదిలీ ఫిల్లర్‌గా చేరిన రాజమల్లు ప్రస్తుతం సర్దార్‌గా పనిచేస్తున్నాడు... ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సమయంలో పదవ తరగతిలో వున్నాడు రాజమల్లు. ఆర్థిక ఇబ్బందులవల్ల అతని చదువు ఆపైన సాగలేదు. దొరకని ఉద్యోగం కొరకు కాళ్లరిగేలా తిరిగి విసిగిపోయాడు. ఉన్న కొద్దిపాటి భూమిని దున్నుకుంటూ కొన్నేళ్లు గడిపాడు. ఆ తర్వాత గని పనిలో చేరాడు.

మొదట్లో గుడిసె వేసుకొనున్న రాజమల్లు అదే స్థానంలో పెంకుటిల్లు కట్టుకున్నాడు. ఆ తర్వాత తనకొచ్చిన సింగరేణి క్వార్టర్‌ను తన మిత్రుడికిచ్చాడు.

గని కార్మికుడిగా ఇరవై ఏళ్ల జీవితం గడిపిన రాజమల్లు ఈ మధ్య గత జీవితాన్ని పదే పదే జ్ఞాపకం చేసుకుంటున్నాడు. పల్లె జీవితానికీ, కార్మిక జీవితానికీ మధ్య గల అంతరాలను, తాను గోదావరి ఖనికి వచ్చిన మొదట్లో వున్న పరిస్థితులకూ ఇప్పటి పరిస్థితులకు గల భేదాలను మాటిమాటికీ జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

తాను పల్లెలో పుట్టాడు. పల్లెలో పెరిగాడు. పచ్చని పంట పొలాల మధ్య... మొక్కజొన్న కర్రల నడుమ... ఆడుకున్నాడు. చెట్లు గుట్ట లెక్కుతూ, మోటగొడుతూ, జంబుగొడుతూ, మంచెక్కి పిట్టలను వడిసెలతో పారద్రోలుతూ రకరకాల వ్యవసాయపనులు చేస్తూ కాలం గడిపాడు. పని చేస్తూ చదువుకున్నాడు. చదువుకున్న తర్వాత అన్ని మోటు పనులూ చేసాడు. అయినా దుర్భరమైన పేదరికం వల్ల తనకు ఊరొదిలి

పెట్టక తప్పలేదు.

తానేం కోరి ఊరొదిల పెట్టాడు?... మరి తాను తన కుటుంబాన్ని ఆదుకోగలిగాడా?... ఇప్పుడు తల్లిదండ్రు లిద్దరూ కాలం చేసినా వాళ్లున్నన్ని రోజులు వాళ్లకు ఊళ్లో వున్న తమ్ముడే ఆధారంగా వుండేవాడు... తాను కుటుంబానికి చేసిందేం లేదు. ఎప్పుడో ఒక్కసారలా ఊరెళ్లి వస్తున్నాడు... తనకేమన్నా చేద్దామనున్నా పరిస్థితులనుమతించడం లేదు.

ఇప్పుడు తన పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. కూతురు పెళ్లి కెదుగుతుంది. కొడుకులిద్దరికీ చదువంతగా అబ్బలేదు. పెద్దవాడు అతి కష్టంమీద ఇంటర్ పాసయ్యాడు. చిన్నవాడు ఇంటర్లోంచి వెళ్లటంలేదు. ఇద్దరూ ఏవేవో సోపతులు చేస్తూ జులాయ్‌గా తిరుగుతున్నారు. చెప్పినా వినడంలేదు. తాను పని చేసుకుంటూ చదువుకున్నాడు. కాని తన కొడుకులకు...? పని పేరు చెబితేనే మండిపడతారు. ఈ యువకుల్లోని చాలామంది అంతే... అటు పనికీకాక ఇటు ఉద్యోగాలూ రాక వీళ్ళంతా రెంటికి చెడ్డ రేవళ్ళవుతున్నారా...! ఈ గోదావరిఖని పారిశ్రామికవాడల్లోని కొంతమంది యువకులు రకరకాల అవాంఛనీయ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు... హత్యలు... దోపిడీలు... ఇంకా... ఇంకా 'అన్న' చెప్పినట్టు చదువుతున్న చదువులకూ, చదవాల్సిన చదువులకూ, పనికీ, పరిస్థితులకూ మధ్య సమన్వయం లేకపోవడంవల్లనే యువతరమిలా తయారవుతున్నారా...?

రకరకాలుగా ఆలోచిస్తున్నాడు రాజమల్లు. మంచంలోంచి లేచి నిల్చున్నాడు. మూత్రం చేసొచ్చి మళ్లీ మంచంలో పడుకున్నాడు.

ప్రహరీగోడవతలున్న రోడ్డుమీద నుండి వాహనాల రొద వినబడుతూంది. బొగ్గు పొయ్యింకా పూర్తిగా అంటుకోలేదు. కొద్దికొద్దిగా పొగ వస్తూనే వుంది. సూర్యుడు పడమరకు చేరుకొని కుంకడానికి సిద్ధంగా వున్నాడు. విశ్రాంతి తీసుకోబోతున్న సూర్యుని నుండి వస్తున్న కిరణాలెర్రగా వున్నాయి.

రాజమల్లు పల్లెను వదిలి గోదావరిఖనికి రావాల్సి వచ్చిన పరిస్థితులు. వచ్చిన మొదట్లో పారిశ్రామిక కాలనీల్లో, గనుల దగ్గరున్న పరిస్థితులు అతని కళ్ల ముందు కదులుతున్నాయి...

అతని మనోనేత్రం ముందెన్నో దృశ్యాలు తిరుగుతున్నాయి...

''బాపూ...? ఈ వ్యవసాయంలో ఎంతజేసినా ఏడే మాస్క-లన్నట్టుంటుంది... ఎక్కడేసిన గొంగడక్కడున్నట్టే వుంటుంది. నేనిక్కన్నుంచి వెళ్లిపోతా''... అన్నాడు రాజమల్లు.

''ఎక్కడికి పోతవు బిడ్డా...? కడప లోపలున్న సుఖం కాశీకి పోయినా దొరకదంటరు... కుండల గలది కలో గంజో తాక్కుంట వున్న భూమిని దున్నుకుంటె బతుకమా...? ఎక్కడికో పొయ్యేం జేత్తవు? సర్కారు నౌకరి దొరికిపోయినా కులం జెడ్డా సుఖం దక్కినట్టుంటది...'' అన్నాడు చంద్రయ్య.

''తమ్ముడు, నువ్వు, నేను- మనమంత వున్న కొంచెం భూమిల ఏమెవుసం జేత్తం బాపు...? ఈ వ్యవసాయం తోటి రోజురోజు కప్పులు పెరుగుడేకాని సంపాదించిందున్నదా? ప్రతిదానికి దొరల,పట్వారీ, పంచేండ్ల పెద్దరికం... మొన్న గొల్ల కొంరయ్య ఎడ్లు రాంరెడ్డి పటేలు చేండ్లో అడుగుపెట్టిందో? లేదో? బూతులు తిడుతూ వారు గట్టెందుకోని కొట్టాడు... అయినా కొంరయ్య ఒక్క మాటనలేదు. ఇవ్వన్నీ చూసుకుంటూ నాకిక్కడుండబుద్ధి కావడంలేదు...''

''దొరల కాలం నడుత్తంది బిడ్డ... కొన్నొద్దులత్తది, కొన్నొద్దులు కోడల్లని గిట్ల ఎన్ని రోజులు

నడుత్తదో సూత్తాం... పోరగాండ్లు మర్లవడుతండ్రు... సంగాలు గడుతండ్రు... ఇగ గీ దొరల దెక్కువ కాలమేం నడువది... సరెగని ఎలుకల బాధకు ఇల్లుగాల వెట్టుకుంటరా బిడ్డ... నువ్వు తమ్ముడు కష్టపడితె ఇంకింత భూమి కొనుక్కోవచ్చు... ఎక్కడికి పోవుడు లేదుండు..''

''భూమిని కొన్కనుడేమో కాని ఉన్న భూమి పోకుంటె చాలు... బాపూ! నేనే పట్నమో ఏం జేసు... గోదావరిఖనికిపోయి బాయి పని జూసుకుంట. అది దొరుకుతె సర్కారు నౌకరన్నట్టే...''

కొడుకు మాటలు విని బాధ, కోపం మిళితమైన స్వరంతో అన్నాడు చంద్రయ్య.

''బాయిల దిగుడో నౌకరా? పది రాక చదువుకున్నోనివిగా తట్టమోసుడు పనిజేత్తావు...! బాయిల దిగినోడు మల్ల మీదికచ్చెరాక నమ్మకముందా? నాలె బొయ్యారంలకు పోతె తల్లి గర్భంలకు పోయినట్టేనాయె... గా నౌకరైతే మద్దూకో... అదో నౌకరట నౌకరి...''

తండ్రి నొప్పించడానికి తల ప్రాణం తోక కొచ్చింది రాజమల్లుకు. ఏడాది కాలం సమయం దొరికినప్పుడల్లా తండ్రితో తాను గని కార్మికుడిగా చేరే ప్రస్తావన తెచ్చాడు రాజమల్లు... రోజు రోజుకూ దిగజారుతున్న కుటుంబ పరిస్థితుల నర్థం చేయించాడు.. షావుకార్ల అప్పుల గూర్చి చెప్పాడు. చివరకు కొడుకును గోదావరిఖని పంపించడానికొప్పుకోక తప్పలేదు చంద్రయ్యకు.

పొలమమ్మి ఐదువేల రూపాయలు లంచంగా ముట్టజెప్పి బదిలీ ఫిల్లర్‌గా చేరాడు రాజమల్లు. ఊరొదిలి గోదావరిఖనికి వస్తున్న రోజున రాజమల్లు తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లెలు, మిత్రులు, బంధువులు కన్నీళ్ళతో ఇచ్చిన వీడ్కోలు అతడెప్పుడూ మరిచిపోలేడు...

పనిలో చేరిన రాజమల్లు ఇక్కడ మరో రకం పరిస్థితులను చూస్తున్నాడు. అయితే గ్రామాల్లో వున్న దొరల ఆధిపత్యానికి ఇక్కడ బాయి దొరల ఆధిపత్యానికీ పెద్దగా తేడా కనబడటంలేదు రాజమల్లుకు. బావిలోకి దిగే అండర్ మేనేజర్ లాంటి వాళ్లను 'దొరా' అని పిలువడం చూసి ఆశ్చర్యపోయాడు. ఏ దొరల సంస్కృతి నుంచైతే తప్పించుకొని రావాలని వచ్చాడో అంతకంటే కొంచెం భిన్నంగా ఇక్కడ దొరల సంస్కృతి వుండడం చూసి నోరు తెరిచాడు. ఇష్టం లేకున్నా యజమానిని 'దొరా' అని పిలువక తప్పడం లేదతనికి. అయినా మాటిమాటికీ గుణిపింపులు... రారా పోరా అనే పిలవడం రాజమల్లుకు బాధాకరంగా వుంది.

కార్మికుడేమైనా అంటే ఉద్యోగం నుంచి తొలగించడం, చార్జిషీట్ లాంటి వియ్యడం తప్పేవికావు... రకరకాల ట్రేడ్ యూనియన్లున్నా కార్మికులను పట్టించుకున్న వాళ్లు తక్కువే. ఆ నాయకులకు మేనేజిమెంటుతో సంబంధాలుండేవి.

జీతాలిచ్చే రోజున నలుగురైదుగురొచ్చి నిల్చున్నారు... జీతం తీసుకున్న ప్రతి కార్మికుడూ వాళ్లచేతిలో కొంత డబ్బు పెట్టి పోతున్నాడు. అదేంటో అర్థంకాక తోటి కార్మికుడి నడిగాడు రాజమల్లు.

''అదంతే.... వాళ్లంతా వివిధ పార్టీలకు చెందినవాళ్లు. వాళ్లలో గూండాలు కూడా వున్నారు. ప్రతి నెలా వాళ్లకు కొంతైనా మామూళ్లరూపంలో ఇవ్వాలి. ఇవ్వకుండా ఇక్కడెవరూ బతికి బట్టలేరు'' అన్నాడు రాజమల్లు మిత్రుడు.

''ఇంతమంది కార్మికులున్నారు కదా?... వాళ్ల నెదిరించలేరా?''

''అవన్నీ మనకెందుకు? లోకంతోని లొటలొట... మన వంతు మనమూ ఇస్తే సరిపోతుంది కదా? లేకుంటే గా లికి పొయ్యే కంపను తగులబెట్టు కున్నట్టవుతుంది.''

అందరితోపాటు రాజమల్లు కూడా ప్రతినెలా జీతం రోజున అక్కడికొచ్చిన వాళ్ళకు మామూళ్లిస్తున్నాడు. ఊళ్లలో దండుగల పేర్లమీద, జాతరల పేర్లమీద డబ్బులు వసూలు చేసే దొర, పట్వారి, పోలీసు పటేళ్లతో వీళ్లకు పోలికలున్నా యనుకున్నాడు రాజమల్లు.

ఓ రోజు ఊర్నుంచి వచ్చిన మిత్రునితో కూచొని హోటల్లో టీ తాగుతున్నాడు రాజమల్లు. నలుగురు వ్యక్తులొచ్చి రాజమల్లుకు రెండు ప్రక్కలా ఇద్దరు, అతని మిత్రుని కిరుప్రక్కలా మరో ఇద్దరు కూర్చున్నారు. వాళ్లు అధికార పార్టీ పెంచి పోషిస్తున్న గూండాలని రాజమల్లుకు తెలుసు. వాళ్లను చూసి లేచిన రాజమల్లుతోపాటు అతని మిత్రుడూ లేచాడు.

''తొందరెందుకు బ్రదర్.. కూర్చోండి...'' అని ఇద్దర్నీ కూర్చుండపెట్టారు వాళ్లు.

''ఏ ఊరు బ్రదర్ మనది...'' రాజమల్లు మిత్రునితో అన్నాడందులోంచి ఓ వ్యక్తి.

చెప్పాడతను.

''ఏం చేస్తుంటాడితను...?''

రాజమల్లుతో అన్నాడికొకతను.

''ఆర్టీసీలో పనిచేస్తున్నాడు...'' చెప్పాడు రాజమల్లు.

''బ్రదర్ ఉద్యోగం కూడా చేస్తున్నాడన్నమాట...'' అని అతని చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు... రాజమల్లు మిత్రుడు వాళ్లను భయంగా చూస్తున్నాడు.

''బ్రదర్...! ఈ ఉంగరం నీకేం బాగాలేదు. మాకైతే బాగుంటుంది... ఇంకోటి చేయించుకో'' అని తన చేతి వేలుకు తొడుక్కున్నాడు.

''ఇదేంటి? ఇలా దౌర్జన్యం చేస్తేమన్నట్టు?'' అన్నాడు రాజమల్లు మిత్రుడు.

''మనది ఆంధ్రనా బ్రదర్? ఊరి పేరడిగితేనేమొ కరీంనగర్ జిల్లాలోని పేరు జెప్పావు. ఇక్కడ గిట్లనే జబర్దస్తీగా తీసుకుంటం. ఎదురుంగ మాట్లాడద్దు..''

కాదుసార్... మీరిట్ల చేయడం...''

రాజమల్లు మాటలను మధ్యలోనే ఆపాడింకో వ్యక్తి. ''అదంతే బ్రదర్..! పోలీసులకు చెప్పినా మాకేంగాదు. అయినా నువ్వు రిపోర్టిస్తే ఖసక్...'' అని బటన్ చాక్ తీసి చూపించాడు.

తన దగ్గరికొచ్చిన మిత్రునికిలా జరగడం రాజమల్లుకు బాధాకరంగా వుంది. అయినా చేసేదేంలేక మౌనంగా నిల్చున్నాడు. ఆ మిత్రులిద్దరూ చూస్తుండగానే ఆ నలుగురూ గళ్ళలెగరేసుకుంటూ వెళ్లిపోయారు.

''పాపపు గాడ్దికొడుకులు. షాపు షాపుకు మామూళ్లు వసూళ్లు జేత్తరు? వీళ్ల పీడెప్పుడు విరగడైతదో?'' అన్నాడు రాజమల్లు ఇచ్చిన బిల్ తీసుకుంటూ మేనేజర్.

మరికొన్ని రోజుల తర్వాత ఓ అమ్మాయిని ఘోరంగా మానభంగం చేసారన్న వార్తగుప్పుమంది. ఆ అవమానాన్ని భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. చాలామంది కార్మికులు శవాన్ని చూసొచ్చారు. వార్త పేపర్లకెక్కింది. అయినా ఎవరూ పట్టించుకున్న వాళ్లు లేరు. మరికొద్ది రోజుల తర్వాత ఆ విషయాన్నందరూ మరచిపోయారు.

ఊళ్లలో షావుకార్ల అప్పులకంటే ఘోరంగా వడ్డీలకు ఇక్కడ అప్పులిస్తుండటం గమనించాడు రాజమల్లు. నెలకు వందకు ఐదు, ఆరు రూపాయల చొప్పున బాకీలు తెచ్చుకునే కార్మికులను చూసాడు.

కార్మికుల అవసరాలను ఆసరాగా చేసుకొని విపరీతమైన వడ్డీతో వాళ్లను దోచుకోవడం గమనిస్తున్నాడు రాజమల్లు.

ఊళ్లో ఉంటే చల్లటిగాలి, నీళ్లన్న దొరికేవి. ఇక్కడ వాటిగ్గూడ కరువే. నీయవ్వ? పెనం మీదికెళ్లి పొయ్యిల పడ్డట్టయింది బతుకు? చాలాసార్లు తనలో తాననుకున్నాడు రాజమల్లు.

★★★

''ఏం ఇయ్యంపుడా..! ఏమో బాగాలోచిస్తుట్టున్నవు?'' అంటూ లోపలికడుగు పెట్టిన బ్రహ్మయ్య మాటలతో రాజమల్లు ఆలోచనలాగిపోయాయి.

''ఏం లేదు... ఏం లేదు'' అంటూ మంచంలో కూర్చున్నాడు రాజమల్లు...

''చెల్లే బొగ్గు పొయ్యంటుకుంది. నిపుకలు కణకణలాడుతున్నయి... కొంచవో'' అన్నాడు బ్రహ్మయ్య...

లక్ష్మి బయటికొచ్చి బొగ్గు బకెట్ తీసుకొని పోబోతున్నదల్లా బ్రహ్మయ్య మాటలు విని ఆగింది.

''మేస్త్రటమేస్త్రి ఇంకా బొగ్గు పొయ్యలమీదనే వంట జేత్తన్నావె చెల్లె. గ్యాస్ స్టవ్ కొనుమనక పోయినవు...''

''ఇంటి పేరు కస్తూరోల్లు ఇంట్లగబ్బిలాల వాసనన్నట్టుంది సంగతి... ఇగ గదొక్కటే తక్కువైందే అన్న'' అంటూ లోపలికెల్లింది లక్ష్మి.

ఆ మాటలతో రాజమల్లు ముఖం చిన్నబోయింది.

''ఏదో పరాచికానికంటే ముఖం మాడ్చుకోవడ్తివేంది...? రేషం బాగానే వుంది మా బావకు...''

''రేషం లేదేం లేదు. మీ చెల్లె అన్నదాంట్లో నాకు తప్పేం కనబడటం లేదు. ఇరువయేండ్ల నుంచి నౌకరి చేస్తున్నమన్నట్టే కాని ఎప్పటి చిప్ప ఎనుగులకన్నట్టే ఉంది. ఇగ గ్యాస్ స్టవులు కొంటమా తియ్యి'' అన్నాడు రాజమల్లు.

''ఎందుకంటవు... మన దాంట్ల మాత్రం గ్యాసుస్టవులు, రంగు టీవీలు, ఫ్రిజ్జులు గిట్ట కొన్నోల్లు ఎంతమందిలేరు? మనసుండాలెగాని మార్గముండదా? పైసలన్ని ముల్లెగడితె ఇగ కొనుడెట్లయితది?''

''ఈ నౌకరి జేసుకుంట కొద్ది పైసలు ముల్లెగట్టినా? పెద్దోడు పెండ్లికెద్దె చిన్నోడు ఇంక దేనికో ఏడ్సిండన్నట్టున్నది నీ కథ. బిడ్డ పెండ్లికెదుగుతంది. పోరగాండ్లిద్దరికి సరిగ్గ చదువబ్బలేదు. వాళ్ళందరెట్ల సెటిల్‌గావన్నని నేం జూత్తంటే గ్యాస్‌స్టవ్ కొనన్నట...''

''అట్ల మాట వరుసకంటి... మనకెందుకు తియ్యిగా గ్యాసుస్టవులు... కంపిని బొగ్గు పుక్కటికి దొరికినంతవరకు మనకు గవ్వేమద్దు...''

''మనం తవ్వుతున్న బొగ్గును మనకిచ్చుటానికి గూడ తిప్పలేనాయె. మనవసరాలకు బొగ్గిచ్చుటానికి గూడ ఎన్ని చెయ్యవలిసచ్చింది మనం...''

''నిజమేనోయ్... ఎవ్వలైతె పంటలు పండిస్తున్నారో వాళ్లకు దానిమీద అధికారం లేనట్టే మనం ఉత్పత్తి చేసిన బొగ్గుమీద మనకధికారం లేదు...''

''వ్యవసాయదారుడికి ఆ పంట తనదన్న ఆత్మీయతుంటుంది. కాని కార్మికుడి శ్రమైతే మరీ పరాయిదైపోతుంది.''

''ఆ పెద్ద పెద్ద మాటలు నాకు తెలువయికాని మన గోదావరిఖనిలనైతే ఓ గమ్మతు పరిస్థితున్నదనిపిస్తుంది. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులంతా వచ్చింది గ్రామాలనుంచి. చాలమంది ఎవుసంతోని సంబంధమున్నోల్లే. చేస్తున్న పనేమో కార్మికులుగా... అయినా ఆ పల్లె మనస్తత్వం పోలేదు. ఆ ప్రేమలింకా పోలేదు. కార్మికులుంటున్న ఒక్కోవాడ ఒక్కో పల్లెటూరు తీరుగనిపిస్తుంది.''

''నువ్వన్నది నిజమేనోయ్''.

పొద్దుగూట్లో పడింది. రోడ్లవెంట కాగితాలు, గోడలకు పోస్టర్లు తింటున్న ఒకటిరెండు పశువులు ఇళ్లకెలుతున్నాయి. మరికొన్ని దారి తెలియక అటూ ఇటూ తిరుగుతున్నాయి. లక్ష్మిగోడకున్న లైటేసింది. టీ తీసుకొచ్చి వాళ్ళకిచ్చింది.

టీ తాగుతూ మాటల్లో పడ్డారు వాళ్లు.

రాజమల్లు ఇంటి పక్కనే వుంటున్న గట్టయ్యొచ్చి వాళ్ళ ప్రక్కన కూర్చున్నాడు. అతడు ఫైర్‌ఫైటర్..

''ఏందేమొ బాగానే మాట్లాడుకుంటండ్రు'' అన్నాడు... ''ఏముంది? కష్టం... సుఖం.. మనం మనం గాకుంటె ఇంకెవ్వలు మాట్లాడుతరు. ఎంతైనా మనం మనం ఒక్కటే'' అన్నాడు బ్రహ్మయ్య.

''కార్మికులంత ఒక్కటేనన్న భావముంటే మొన్నటి సమ్మెగట్లయ్యేదా? నెలకు పైన సమ్మె జేస్తిం... జీతం బాయె. ఒకలేమొ సమ్మె విరమించుకొమ్మనిరి. ఇంకొగలు వద్దనిరి. మరో దిక్కు పోలీసోల్లు బెదిరించి కొట్టి బాయలల్లకు దించిరి. గిన్నేండ్ల నుంచి పనిచేస్తున్నా ఇదంత వడ్లు పెరుగు కలిసినట్టే అనిపిస్తుంది. ఈ సమ్మెతోని ఏం సాధించినట్టయింది?'' అన్నాడు రాజమల్లు.

''గట్లెందుకంటవురాజమల్లు! మన సమ్మెతోని అన్నీ ఆగిపోయే పరిస్థితులొచ్చినయి. ఏదో ఓ మేరకు ఫలితముండదను కోవద్దు. కాని గీ లీడర్లే ఒకలు చెయ్యమనిరి. ఇంకొగలువద్దనిరి. మొదలేమొ సమ్మె చేయమంటే చేసిచ్చిరి. సమ్మె మొదలైనంక పరిస్థితి వాళ్లచేతులు దాటింది'' అన్నాడు గట్టయ్య.

''తెగింపనేది లేనప్పుడు ఏ పనిగాదు. జీతం బోతుందని ఇంకేదో నష్టమవుతుందని భయపడితే కార్మికుడి పరిస్థితి అధోగతే. ఓ పని జేసినప్పుడు నష్టాలు లాభాలు, మంచి చెడుల ఉండనే ఉంటాయి. అయితే సమ్మె అనేది ఆఖరి ఆయుధం కావాలన్నారు. కాని మన వాళ్లు మాటి మాటికీ సమ్మె ఆయుధాన్నే ఉపయోగిస్తున్నారు. మొన్నటి సమ్మయితే వివిధ ట్రేడ్ యూనియన్లు కార్మికుల మీద పట్టుకోసం చేయించినట్టనిపిస్తుంది. త్వరలో ఎన్నికలున్నాయికదా!'' అన్నాడు బ్రహ్మయ్య.

''నిజమే... మంచికో చెడుకో కాని ఎన్నో యూనియన్లచ్చినయి. నేను వచ్చినప్పటికిప్పటికి చాలా తేడాలచ్చినయి'' అన్నాడు రాజమల్లు. ''అవును. బావి బావికి తిరిగి మామూళ్లు వసూల్లు చేసే గూండాలంతా తోకలు ముడిచిండ్రు. హోటళ్లలో కూచొని హాయిగా చాయలు తాగే పరిస్థితులు గూడ లేకుండె. దెబ్బకే వాళ్లంతా నామరూపాలు లేకుండా పోయిండ్రు'' అన్నాడు గట్టయ్య.

''ఆసోంటి గూండాలు పోయినమాట నిజమేకాని లుంగీలు కట్టుకొని లైట్లు గొట్టుకుంట తిరిగే పడుసు పోరగాండ్ల సంఖ్య పెరిగింది. చౌరస్తాలకాడ నిల్చొని పోకిరీ పనులు చేస్తండ్రు.''.

''బ్రహ్మయ్యన్నది నిజమే. అప్పుడు నౌకర్ల చేరిన వాళ్ల పిల్లలు షడుచోల్లయితండ్రు. వాళ్లందరికీ ఉద్యోగాల్లేవు. సరైన చదువుల్లేవు. బాగా చదువుకున్నోల్లు కొంతమంది మా చదువుకున్నరు. చదువుకుంటండ్రు. మిగిలినోల్లేంజేయన్నో తెలువక ఇసోంటి పనులు జేత్తండ్రు'' అన్నాడు రాజమల్లు.

''ఏదేమైనా గుండాల బెడద పోయింది. అడ్డగోలు వడ్డీలకు అప్పులిచ్చెటోల్లు ఒక్క దెబ్బకే

ఫైనాన్స్‌లన్నీ మూతలుపడ్డయి. ప్రైవేటు షావుకార్లిచ్చే 'మిత్తి' రేటు కూడా తగ్గింది.7

"బాగా ఆలోచిస్తే నాకో అర్థమవుతుంది. గ్రామాలల్ల ఉద్యమాలు మొదలైనంక అక్కడ దొరల, షావుకార్ల దోపిడీ కొంత తగ్గింది. గ్రామాలల్ల మొదలైనంక రెండు మూడేండ్ల తర్వాత కార్మికులల్ల అలాంటి ఉద్యమాలు మొదలైనవి. కరీంనగర్ లాంటి పట్టణాల్లో కాని, గోదావరిఖనిలాంటి పట్టణాల్లో కాని గూండాల అడ్డగోలు, వడ్డీకిచ్చే వ్యాపారుల దౌర్జన్యాలు ఆగిపోవడం ఉద్యమాల తర్వాతే. అంటే పదిహేనేళ్ళ నుంచే" అన్నాడు రాజమల్లు.

"అవును. ఇందులో అనుమానపడాల్సిందేం లేదు. బాయి దొరల జులం తగ్గి కార్మికుడిదే పైచేయి కావడం, దొరలని పిలిపించుకునే బాయి దొరలు అన్నా, తమ్మీలకు దిగడం ఇవన్నీ ఉద్యమాలతోనే. కాని మన జిల్లా మన ప్రాంతమంతా అగ్నిగుండంలా తయారైంది. డ్యూటీకి పోయిన వ్యక్తి ఏ ఎన్‌కౌంటర్ పేరుమీద కాల్పులకు గురవుతాడోనన్న భయముంది. బతుకు దినదినగండంగా మారిపోయింది" అన్నాడు బ్రహ్మయ్య.

"ఆ మాట నిజమే. ఈ విషయమే నేనోసారి మన అన్నతో అంటే ఏమన్నాడో తెలుసా? ఇప్పుడు కొత్త వ్యవస్థ ఆవిర్భావం కోసం యుద్ధం జరుగుతుంది. యుద్ధం జరుగుతున్న సమయంలో ప్రశాంతంగా ఏ అలజడి లేకుండా వుండాలంటే సాధ్యమవుతుందా? యుద్ధం యుద్ధమే. ఈ యుద్ధ సమయంలో జీవన్మరణ పోరాటాలు చేయక తప్పదు. ఏదో మేరకు వాటి ఫలితాలు సామాన్య ప్రజల మీదా పడక తప్పదు అన్నాడు. బాగా ఆలోచిస్తే 'అన్న' మాటల్లో ఎంతో అర్థముందనిపిస్తుంది. ఆ అన్నెవరో మీకు తెలియదా?" అన్నాడు రాజమల్లు.

'అన్న' తెలియకపోవడమేంటి? మన ప్రాంతంలో నిజమైన కార్మికోద్యమాన్ని నిర్మాణం చేసిందా అన్నే. మనం ఈ మాత్రమైనా తలెత్తుకోగలుగు తున్నామంటే, హక్కులను అనుభవిస్తున్నామంటే దాని కారణం అన్నే" అన్నాడు బ్రహ్మయ్య.

"అవును... అవును" అన్నారు మిగతా ఇద్దరు. చీకటి క్రమంగా చిక్కబడుతుంది. చల్లని గాలి శరీరాలకు తాకుతుంటే వాళ్లు మంచాల్లోంచి లేచి నిల్చున్నారు. గోడ ప్రక్కనున్న సిమెంటు గద్దెమీద కూర్చున్నారు.

'అన్న' అనేమాట ఉచ్చరించినా, విన్నా రాజమల్లు శరీరం పులకింతకు గురవుతుంటుంది. ఒక్కోసారి భయంతో వణికిపోతాడు కూడా. పదిహేనేళ్ల క్రితం అన్నతో పరిచయం కాకపూర్వం రాజమల్లు ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. జీవితమంటే ఓ విరక్తి భావముండేది. కాని అన్న అతనికి జీవితమంటేంటో చెప్పాడు. బతుకుపైన ఆశను పెంచాడు. జీవితాన్ని ప్రేమించడం నేర్పాడు. 'అన్న'తో కార్మికుల పోరాటాల్లో పాలుపంచుకోలేదు కాని తన పరిమితులకు లోబడి సానుభూతి పరుడిగా ఉండిపోయాడు. అన్న జ్ఞాపకం వచ్చి రాజమల్లు హృదయం ఆనందంతో జలదరించింది. అడుగడుగునా ప్రమాదభరితమైన జీవితం మదిలో మెదిలి భయకంపితమూ అయింది.

"అన్న కార్మికోద్యమాన్ని నిర్మించడానికెన్ని కష్టాలు పడ్డాడు? ఎన్ని ప్రమాదాలనెదుర్కొన్నాడు? ఎన్నిసార్లు జైలుకెళ్లాడు? నిజంగా 'అన్న' అనే పదమే ఎంతో పవిత్రమైందనిపిస్తుంది. ఈ అన్నలని చెప్పబడే వాళ్ళంతా నిజానికి తమ్ముళ్ల వయసున్న వాళ్లు కూడా కాదు. అయినా ఎన్ని మార్పులు తీసుకొచ్చారు?" అన్నాడు రాజమల్లు.

''ఏందీరోజు పూర్తిగా అన్నకు సపోర్టు మాట్లాడుతున్నావు? రోజులు మంచిగలేవు. గోడలకు చెవులుంటాయి. ఏ పోలీసోని చెవుల్లోనైనా ఈ మాటలు పడ్డాయంటే మనకు కష్టాలు తప్పవు'' అన్నాడు బ్రహ్మయ్య.

''నిజమేకాని నాకెందుకో ఈరోజు మనసు విప్పి మాట్లాడాలనిపిస్తుంది. ఓసారి నేను అన్ననో మాటడిగాను. మనం కోరుకున్న సమాజాన్ని శాంతియుత పద్ధతుల ద్వారా సాధించుకోలేమా? బలప్రయోగం, రక్త ప్రవాహాలెందుకని? అప్పుడు అతడు చెప్పిన మాటలు నా జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేను! అతడేమన్నాడో తెలుసా?

తమ్మీ! మనిషెంతో బుద్ధిమంతుడు. సర్వశక్తిమంతుడూ మనిషే. అతడు కొండలను పిండి చేయగలడు. ఘోరారణ్యాలను సస్యశ్యామలమైన పంట భూములుగా మార్చాడు. తనకెంతన్నో రెట్లు బలవంతమైన జంతుజాలంపై ఆధిపత్యం చలాయించగలుగుతున్నాడు. మనిషేత్యాగశీలి. మేధావి. అన్ని మనిషే.

అదే మనిషి పరమ స్వార్థపరుడు కూడా ఆ మనిషేస్పార్టకస్‌లాంటి ప్రజాపక్షం వహించినపౌరులను మట్టుబెట్టాడు. ప్రశ్నించడం నేర్పిన చార్వాకులను చంపేసాడు. సాక్రటీస్ లాంటి వాడికే విషమిచ్చాడు. ఏసును శిలువవేసాడు. బౌద్ధాన్ని వ్యతిరేకించాడు. తన స్వార్థం కొరకు ఆధిపత్యం కొరకు ఎంతటి రక్తపాతాన్నైనా సృష్టించాడు. చరిత్ర నధ్యయనం చేస్తే మనకిదంతా అర్థమవుతుంది. అలాంటి మనిషి అధికారాలను, చట్టాలను, సంపదలను తన దగ్గరుంచుకొని ఎంతో బలవంతుడయ్యాడు. మరాతడు మంచి మాటలు చెబితే వింటాడా? కేవలం మాటలతోనో రాతలతోనో సమాజంలో మార్పు లొచ్చేదుంటే ఈ బలప్రయోగాలెందుకు? మేం కావాలని బలప్రయోగమేం చేయడంలేదు'' అని ఆగాడు రాజమల్లు.

అతని కళ్లముందు అన్న రూపం కదులుతుంది.

బ్రహ్మయ్య, గట్టయ్య ఏం మాట్లాడలేదు. రాజమల్లు మాటల గూర్చి ఆలోచిస్తున్నారు. కొద్దిసేపాగి మళ్లీ రాజమల్లే అన్నాడు.

''బ్రహ్మయ్యా! మనం మొదట్లో మానవుడంటే ఎవరు అనే విషయం గూర్చి మాట్లాడుకునే వాళ్ళం... పుట్టిన వాళ్ళందరూ మనుషులే కారు. అందులోంచి మానవులుగా బతికేది అతి కొద్దిమందే. కేవలం తన కోసమేకాక తోటి మనిషి కోసం పాటుపడే వాడే మానవుడు. మనిషి జన్మకు సార్థకత అదే అన్న అన్నమాటలు సత్యాలు. అలాంటి మానవుడే అన్న..''

వాళ్లలా మాట్లాడుకుంటుండగానే పరారీ గోడకు సైకిలానించి గబగబా లోపలకు పరుగెత్తుకొచ్చాడు మధూకర్‌రెడ్డి. అతడు వేగంగా సైకిల్ నడుపుకొచ్చాడని కారుతున్న చెమటలను చూస్తేనే అర్థమవుతుంది. ఆతడాయాసంతో రొప్పుతున్నాడు. అతన్ని చూసి ముగ్గురూ లేచి నిల్చున్నారు.

''ఏమైంది రెడ్డీ, ఏమైంది?'' అడిగాడు బ్రహ్మయ్య.

''బయటద్దు... లోపలికి పోదాం పదండి'' మొసకొడుతూ అన్నాడు మధూకర్‌రెడ్డి.

నలుగురూ కలిసి ఇంట్లోకెళ్లారు.

రోడ్డుమీది నుంచి పోలీసు జీపులంటూ ఇటూ తిరుగుతున్నాయి.

''ఏమైంది రెడ్డీ ఏమైంది?'' మళ్లీ అడిగాడు బ్రహ్మయ్య.

''అన్న మన అన్న పోలీసు కాల్పుల్లో మరణించాడు'' అని భోరుభోరున ఏడుస్తున్నాడు

మధూకర్‌రెడ్డి.

ఆ మాటలు విన్న రాజమల్లు నోట్లోంచి ఒక్క మాట కూడా రావడంలేదు. వాళ్ళంతా వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. రాజమల్లు తల కొట్టుకుంటూ ఏడుస్తున్నాడు. లక్ష్మి సన్నగా రోదిస్తుంది.

''అన్న చనిపోయాడా? మానవుడు చనిపోగూడా? కార్మికోద్యమ నిర్మాత కన్నుమూసాడా?'' తనలో తానే మదనపడుతూ చేత్తో తల బాదుకుంటున్నాడు. ఆ నలుగురూ ఒకర్ని పట్టుకొని ఒకరు ఏడుస్తున్నారు. కొద్దిసేపాగింతర్వాత మధూకర్‌రెడ్డితో అన్నాడు రాజమల్లు.

''రెడ్డీ... పోదాంపా... అన్నను చూద్దాం. ఎక్కడున్నడో చూద్దాంపా''

''ఇప్పుడు బయటకు పోయే పరిస్థితులు లేవు. పోలీసులు నానా బీభత్సం చేస్తారు. ఈ చీకట్లో ఏం కనబడుతుంది? ఎక్కడ జరిగిందో కూడా సరిగ్గా తెలియదు. అందరూ అనుకుంటున్నారు. పోలీసులు హడావిడిగా తిరుగుతున్నారు. భయంతో ఎక్కడివాళ్లక్కడ తలుపు లేసుకుంటున్నారు''.

''అన్న ఓపెనే కదా! చంపవలసిన అవసరమేముంది''

''ఎవర్ని మాత్రం చంపవలసిన అవసరమేముంది? ప్రజల పక్షం వహించే వాళ్లకివి తప్పదు. ఈ రాత్రి బయట కెళ్లకండి. ప్రొద్దున అన్ని విషయాలు తెలుస్తాయి. ఎవరింటికి వారెళ్లిపొండి'' అని గబగబా వెళ్లిపోయాడు సుధాకర్‌రెడ్డి. అతని వెంటనే బ్రహ్మయ్య, గట్టయ్య వెళ్లిపోయారు.

రాజమల్లు కాని లక్ష్మికాని అతని పిల్లలుకాని ఆ రాత్రి పచ్చి మంచినీళ్లు కూడా ముట్టలేదు. ఎంత ప్రయత్నించినా రాజమల్లు కంటిమీద కునుకుపడటంలేదు. ఎంత గట్టిగా కళ్లు మూసుకున్నా అన్న రూపమే కళ్ళ ముందు కదులుతుంది. అతని పనులు, మాటలు తనతో పరిచయం అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి.

★ ★ ★

పేద దళిత కుటుంబంలో పుట్టాడు అతను. ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాడు. ఆ సమయంలోనే ఓ ఫ్యాక్టరీలో ట్రెయినీగా ఉద్యోగం వచ్చింది. ట్రెయినీగా వున్నప్పుడే హక్కులకోసం తోటివాళ్లను కదిలించాడు. ఇతర రాష్ట్రంలో ట్రెయినింగ్ పూర్తికాకముందే ఫ్యాక్టరీకి పంపారు. ఆ తర్వాత రెగ్యులర్ ఉద్యోగయ్యాడు. తన చుట్టూ ఉన్న పరిస్థితుల నర్థం చేసుకున్నాడు. చుట్టూ వున్న గని కార్మికుల బతుకులనూ అవగాహన చేసుకున్నాడు. అప్పటివరకు నామమాత్రంగా వున్న ట్రేడ్ యూనియన్ల పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాడ. అప్పుడప్పుడే మొదలవుతున్న ఉద్యమాల గూర్చి తెలుసుకున్నాడు. తాను చేయవలసినదేంటో నిర్ణయించుకున్నాడు. అన్ని సిద్ధాంతాలనూ చదివాడు. అశేష ప్రజానీకానికుపయోగపడే దేంటో తెలుసుకున్నాడు. మొదట తాను చేస్తున్న ఫ్యాక్టరీలో నాయకత్వం చేపట్టాడు. అటు తర్వాత ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలను లక్షలాది కార్మికులున్న గని కార్మికలకు విస్తరించాడు.

ప్రతి కార్మికున్నీ కలుసుకున్నాడు. ప్రతి స్త్రీతోనూ మాట్లాడాడు. వాళ్ల వాళ్ల సమస్యలనర్థం చేసుకున్నాడు. అందరి నోళ్లలో అతని పేరే నానడం, ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలు పెరగడం అంతకు ముందున్న నాయకులకు యాజమాన్యానికి కంటగింపయింది.

భౌతికంగా అతడు లేకుండా చేయడానికి నాయకులు ప్రయత్నించారు. రెండుమూడు సార్లు ప్రమాదాన్ని త్రుటిలో తప్పించుకున్నాడు. ఆ తర్వాత అందుకు తగిన విధంగా జవాబు చెప్పడం నేర్చుకున్నాడు. కార్మికుల మద్దతు, ప్రజల మద్దతు విశేషంగా వున్న అతడు దెబ్బకు దెబ్బ తీయడం మొదలు

పెట్టడంతో వాళ్లంతా తోకలు ముడిచారు. గుండాలు, చందాలు వసూలుచేసే వాళ్లు మరెంతో మంది తమ కార్యక్రమాలను మానుకోక తప్పలేదు.

ఆతన్నుద్యోగం నుంచి సస్పెండు చేసారు. అయినా భయపడలేదు. హాయిగా బ్రతుకగలిగే ఉద్యోగమే అయినా పచ్చి పులుసు నీళ్ళతో తిన్నాడు. తోటి కార్మికులేది పెడితే అది తిన్నాడు. ఆ తర్వాత అతన్ని ఉద్యోగంలోకి తీసుకోక తప్పలేదు.

స్వల్పకాలంలోనే వేలాది కార్మికుల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నాడు. మరికొద్దిరోజుల్లో అతని అసలు పేరునే మరిచిపోయారు. అతడందరికీ 'అన్న' అయిపోయాడు.

అందరికీ అన్నయ్యై కుటుంబాల్లోని తగవులనెన్నిటినో తీర్చాడు. ఎన్నో పోరాటాలను నడిపాడు. ఆ ప్రాంతంలో కార్మిక వర్గానిదే పైచేయి కావడానికి అతని నిరంతర శ్రమే కారణం. అతనితోపాటు జీవన్మరణ పోరాటాల్లో పాలుపంచుకున్న కార్మికవర్గమూ కారణమే.

జైల్లూ, లాకప్పులూ ఏవీ అతన్ని ప్రజల పక్షం వహించడానికి నిరోధకాలు కాలేదు. అతనితోపాటు మరికొన్ని వామపక్ష గ్రూపుల నాయకులు ట్రేడ్ యూనియన్లు స్థాపించి కార్మికవర్గ ప్రయోజనాల కోసం పనిచేసినా కార్మికోద్యమ నిర్మాణానికి అతడు చేసిన కృషి అద్వితీయం.

అతడా ప్రాంతంలో బలమైన శక్తిగా రూపొందింతర్వాత అతనిపై కొన్ని విమర్శలూ రాసాగాయి. అందులో ఒకటి కంట్రాక్టర్ల దగ్గర చందాల్లాంటివి వసూలు చేయడం. ఆ విషయమే అడిగాడు రాజమల్లు.

''అవును... అప్పుడప్పుడు వాళ్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నమాట నిజమే. మరి మేం చేస్తున్న ఎన్నో కార్యక్రమాలకు డబ్బు వచ్చే మార్గమేంటి? ఏ తరహా వ్యవస్థకు వ్యతిరేకంగా నైతే పోరాడుతున్నామో ఆ వ్యవస్థకు ప్రతినిధుల్లాంటి కంట్రాక్టర్లనుండి చందాలు తీసుకోవడం ఒక విధంగా తప్పే. కాని లక్షలాదిగా ప్రజల సొమ్మును స్వాహా చేస్తున్న వాళ్ల ధనంలోంచి కొంతైనా మంచి కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది కదా! అయినా తప్పనప్పుడు మాత్రమే మేమిలా చేస్తున్నాం. అట్లని వాళ్ల కనుకూలంగా ఉంటామనుకుంటే మాత్రం తప్పే'' అన్నాడు.

ఎవరూ పట్టించుకోని అసంఘటిత కార్మికుల గూర్చి పొట్ట చేతబట్టుకొని వచ్చిన ఒరియా కూలీల గూర్చి కూడా ఎన్నో పోరాటాలు నడిపాడు.

ఆ పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న ఒరియా కూలీల పిల్లల చదువుల గూర్చి ఎవరూ పట్టించుకోలేదు. విద్యనే వ్యాపారంగా చేసుకొని ప్రైవేటు పాఠశాలలు లక్షలార్జిస్తున్నాయి. అలాంటి పాఠశాలల్లో చదివించే శక్తి కూలీలకు, ఒరియావాళ్లకు లేదు. వాళ్ల కోసం పాఠశాల స్థాపించి నాలుగువందల మందికి ఉచిత విద్యా సౌకర్యం కల్పించాడు. ఏ ప్రభుత్వమూ పట్టించుకోని వాళ్లను పట్టించుకున్నాడు. ఆ పాఠశాలలను చూసిన రాజమల్లు చందాలు వసూలు చేయడంలో తప్పు లేదనుకున్నాడు. ఆ తర్వాత కనబడిన అన్నను బిగియారా కౌగిలించుకున్నాడు.

కార్మికులు, సామాన్య ప్రజల పాలిట ఆత్మబంధువై తాను నమ్మిన వ్యవస్థ స్థాపన కోసం పోరాటాలు చేస్తూ దినదినగండంగా బతుకున్నాడు అన్న. యాజమాన్యాల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ కార్మికుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాడు.

రష్యాలో జరిగిన మార్పులను చూసింతర్వాత ఓరోజు 'అన్న'తో అన్నాడో కార్మికుడు.

''ప్రపంచ పరిణామాలను చూస్తుంటే మీరనుకున్న వ్యవస్థ రావడం అసాధ్యమని

తెలియడంలేదా? ఓ దిక్కు– ఉన్న వ్యవస్థలే కూలిపోతుంటే ఇక్కడ వస్తుందని ఎలా అనుకుంటున్నారు? వచ్చినా ఎన్నేళ్లుంటుంది? ఇదంతా చూస్తుంటే మీరు చేస్తున్న పని ఏటికి ఎదురీదడమే అనిపిస్తుంది. ఎండమావుల్లో నీటి కోసం వెతకడమే ననిపిస్తుంది?''

ఆ మాటలు విన్న అన్న ముఖంలో రంగులు మారాయి. నొసలు ముడతలు పడింది. అతనిలో తీవ్రమైన మానసిక వేదన రగిలింది. ఏమనుకున్నాడో ఏమో చిన్న పిల్లవాడిలా వెక్కి–వెక్కి– పడి ఏడ్చాడు. కొద్దిసేపైన తర్వాత మామూలు స్థితిలోకొచ్చాడు.

''ఈ పరిణామాలను చూస్తుంటే దుఃఖమాపుకోలేక పోయాను. కాని ఇవి తప్పవు. నాలుగు దిక్కు–లా ఇతర శక్తులు లాగుతుంటే వాటి ప్రభావం పడకుండా కాపాడటం కొందరికే సాధ్యమవుతుంది. ఆ కొందరే మహానాయకులవుతారు. తర్వాతేవో పరిణామాలొస్తాయని సర్వ మానవాళికి మేలు చేకూర్చే వ్యవస్థను కాదనడం భావ్యమా? కోరుకోవడం తప్పా? రష్యాలో ఎన్ని పరిణామాలొచ్చినా అక్క–డ తీవ్రమైన ప్రతిఘటనుంది. స్పార్టకస్ పోయాడు. అతని వారసత్వం పోయిందా? అల్లూరి పోయాడు. ఆయన వారసత్వం పోయిందా?'' అన్నాడు.

తాను కోరుకున్న వ్యవస్థ తప్పకుండా వస్తుందన్న నమ్మకంతో వున్నాడు. ప్రతి బహిరంగసభ ఉపన్యాసంలోనూ కార్మికులకు చెప్పే మాటల్లోనూ తన నమ్మకాన్ని గూర్చి చెప్పాడు.

★★★

''అలాంటి అన్న మరణించాడా? అన్నకు మరణముందా? వీల్లేదు. అన్న మరణించడానికి వీల్లేదు.'

తనలో తానునుకున్నాడు రాజమల్లు. లేచి కూర్చున్నాడు. అతని కళ్లు ఎర్రబడున్నాయి. మనసంతా తీవ్రమైనవేదనతో కళపెళా కాగుతుంది. అర్ధరాత్రి దాటింది. చలి విపరీతంగా వుంది. రోడ్లమీద అప్పుడప్పుడు జీపు చప్పుడు వినబడుతుంది.

అన్న విషయం తెలిసిన ఎవరింట్లోనూ కంటిమీద కునుకులేదు.

అన్నను చూడక ఆర్నెల్లయింది రాజమల్లుకు. చివరిసారిగా అన్న దేహాన్నైనా చూడాలనుకుంటున్న రాజమల్లుకు ఎంతకూ నిద్ర పట్టడంలేదు. ఇంట్లోనే అటూ ఇటూ తిరుగుతున్నాడు అతని మనసునిండా అన్నే.

'ఏదైతే అదవుతుంది. నన్ను కాల్చేస్తే కాల్చెయ్యనియ్యి. తెల్లారేసరికి శవాన్నుంచుతారో లేదో? అన్నను చూసొస్తా' - తనలో తానునుకొని బయటకెళ్లడానికి తలుపుతీసాడు రాజమల్లు.

ఎదురుగా నిల్చొనున్న అన్నను చూసి ఆశ్చర్యంతో అలాగే నిల్చున్నాడు. కొద్ది క్షణాలాగి 'అన్న... అన్న' అంటూ బిగ్గరగా కౌగలించుకున్నాడు.

రాజమల్లు కళ్లవెంట పటపటా కారుతున్న నీరు అతని చొక్కాను తడుపుతుంది.

''అన్నా... నేను విన్న వార్త...''

''ఎన్‌కౌంటర్‌లో... గని వద్ద ఓ కార్మికుడు చనిపోయినమాట నిజమే. నా పోలికలున్న ఆ వ్యక్తిని చూసి నేననుకున్నారు. బోర్లా పడుండటంవల్ల సరిగ్గా తెలియలేదు. నేనీరోజు మధ్యాహ్నం ఆ గని దగ్గరికెళ్లడంవల్లనేనే అనుకోవడానికి మరింత దోహదం చేసింది.''

రాజమల్లు ఇంటి వాళ్ళంతా లేసొచ్చి అన్నచుట్టూ మూగారు. రాజమల్లు అతన్ని పట్టుకొని ఏడుస్తున్నాడు.

''ఏంటిది రాజమల్లూ! ఆ స్థానంలో నేనైనా వుండొచ్చు. ఎప్పుడో ఓసారది తప్పకపోవచ్చు. నేను పోతే మరొకరు అతను పోతే ఇంకొకరు. వ్యక్తులు పోయినంత మాత్రాన పనులాగిపోవు. ఈ పోరాటాల్లో ఎంత మంది పోయారో నీకు తెలియదా? అయినా వాళ్లంతా మనగుండెల్లో ఇంకా గూడుకట్టుకొని వుండనే వున్నారు. ప్రజలతో మమేకమై పని చేసేవాడికి చావులేదు.''.

''అవును'' మరోసారి కౌగిలించుకున్నాడన్నను. ఎందుకోకాని రాజమల్లుకు దుఃఖ మాగడంలేదు. అతన్ని ఓదార్చాడాతను.

''రాజమల్లన్నా! మన ప్రాంతంలో, మన ప్రాంతంలో ఏం కర్మ పోరాటాలుధృతంగా వున్న తెలంగాణా జిల్లాల్లో ఓ విచిత్రమైన పరిస్థితుంది. ఓ దిక్కు ఉద్యమాల తీవ్రతుంది. మరో దిక్కు మూఢమైన నమ్మకాలింకా వున్నాయి. ప్రతిఘటనలతోపాటు కుల సమస్య ఇంకా పీడిస్తూనే వుంది. ఏ సామాజిక శాస్త్రవేత్తా భాష్యం చెప్పలేని పరిస్థితులున్నాయక్కడ. ఓ దిక్కు పోరాటాలకు మద్దతు తెలిపే జనాలు గణనీయంగానే వున్నారు. మరో దిక్కు వ్యతిరేకతా వుంది. అయితే ఇవి రెండింటినీ బాహాటంగా వ్యక్తం చేసేవాళ్లు తక్కువే. అందుకేనూతన వ్యవస్థ నిర్మాణం కోసం పోరాటం చేసేవాళ్లవన్నీ దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముంది. ఏ కొద్దిమంది పోరాటంవల్లనో విప్లవం రాదు. అందులో మెజారిటీ జనాల భాగస్వామ్యం కావాలి. అట్లని చేతులు ముడుచుకొని కూచోవాలనడంలేదు. ఈ వార్త విని ఆందోళన పడకుండా వుండాలని ఆత్మీయులందర్ని కలుసుకుంటున్నాను'' అని చీకట్లో కలిసిపోయాడు అన్న.

అన్న మాటల గూర్చి మననం చేసుకుంటున్నాడు రాజమల్లు.

''అన్నకు మరణంలేదు. ప్రజల గుండెల్లో శాశ్వతంగా ఉంటాడన్న... చిరంజీవి అన్న...'' తనలో తాననుకుంటూ మంచంలో కొరిగాడు రాజమల్లు.

కొద్ది నిమిషాల తర్వాత ఆ చనిపోయిన కార్మికుడెవరోనన్నది జ్ఞాపకం వచ్చి ఎంత ప్రయత్నించినా నిద్రపట్టడంలేదు రాజమల్లుకు.

*రచన మాస పత్రిక ఫిబ్రవరి '97*

*తెలుగుకథ '97లో నుంచి*

# సృష్టికర్తలు

